ప్రజాశక్తి
సోమవారం 1 మే 2023
I
అల్లూరి సీతారామరాజు



## ఎమ్మెల్యే ఫాల్గుణ పర్యటన

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: మండలంలోని అరమ పంచాయతీ బిడిమెల ముసిరిగొందిగూడ గ్రామంలో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ గడపగడపకు కార్యక్రమం నిర్వహించారు. గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ఎమ్మెల్యే గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నవరత్న పథకాలను అమలు చేస్తూ ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ఆర్థిక భరోసాను కల్పిస్తుందన్నారు. వైసిపితోనే గిరిజన ప్రాంత అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బి.ఈశ్వరి, జడ్పిటిసి సిహెచ్ జానకమ్మ, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఫాల్గుణ

# ఉపాధికి ఎదురుచూపు

### -చాపరాయి టెండర్ పాట విధానం రద్దు -ఐటిడిఎలో విలీనం- మూడు నెలలైనా కల్పించని ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:మండలంలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో ఐటీడీఏ అధికారులు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తారని నిరుద్యోగ యువత ఎదురుచూపులు చూస్తున్నారు. గతంలో నిర్వహించిన టెండర్ పాట విధానాన్ని రద్దు చేసి, ఈ ఏడాది ఐటిడిఏ విలీనం చేసుకొని సుమారు మూడు నెలలు గడుస్తున్న ఇప్పటికీ ఐటిడిఎ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకపోవడంతో స్థానిక యువత ఆందోళనకు గురవుతున్నారు.చాపరాయి జలపాతం నిర్వహణకు కొల్లాపూట్టులో పని చేస్తున్న సిబ్బందిని ఇక్కడకు తీసుకొచ్చి రోజువారీగా పర్యాటకుల ప్రవేశ రుసుములను అధికారులు వసూలు చేయిస్తున్నారు. కానీ ఇక్కడ యువతకు ఇప్పటి వరకు ఎటువంటి అవకాశం కల్పించక పోవడంతో అధికారులు ఎప్పుడు ఉపాధి అవకాశాలు కల్పిస్తారని నిరుద్యోగ యువత ఎదురు చూపులు చూస్తున్నారు. జలపాతంలో పర్యాటకుల సౌకర్యార్థం కొరకు అభివృద్ధి పనులు చేపట్టేందుకు గాను గతంలో యేడాదికి ఒకసారి టెండర్ పాట విధానంను అమలు చేసి దాని ద్వారా వచ్చే నిధులతో పలు అభివృద్ధి పనులను చేపట్టేవారు. ఈ ఏడాది నుంచి టెండర్ పాట విధానంను రద్దు చేసి ఐటీడీఏలో విలీనం చేసినట్లు అధికారులు చెప్తున్నారు. విలీనం చేసిన తర్వాత స్థానిక యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అధికారులు ప్రకటించారు. ఇప్పటివరకు ఎటువంటి ఉద్యోగాలు భర్తీ చేయకపోవడంతో నిరుద్యోగ యువత ఉపాధి కల్పిస్తారా !లేదా !అనే సందేహంలో ఉన్నారు. స్థానిక నిరుద్యోగ యువత డిగ్రీ, పీజీ, బీఈడీ, బీటెక్, అగ్రికల్చర్‌తో పాటు ఇతర ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగాలు లేక నిరుద్యోగ సమస్యతో ఖాళీగా ఉన్నారు. చాపరాయి జలపాతంలో ఐటిడిఏ ఆధ్వర్యంలో ఉద్యోగాలు భర్తీ చేసి ఉపాధి కల్పిస్తారని వీరంతా ఎదురు చూస్తున్నారు. దీనిపై అధికారులు ఇప్పటికీ స్పష్టత ఇవ్వక పోవడంతో నిరుద్యోగ యువత ఆందోళనకు గురవుతున్నారు. ఇక్కడ భర్తీ చేసే ఉద్యోగాల్లో మధ్యవర్తుల దళారీలకు ప్రాధాన్యత ఇవ్వకుండా పత్రిక ప్రకటనలో ప్రకటించి పారదర్శకంగా జరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని నిరుద్యోగ యువత కోరుతున్నారు.

#### ఉపాధి కల్పించాలి

చాపరాయి జలపాతంలో చదువుకున్న స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలి. ఉన్నత చదువులు చదివి అనేకమంది నిరుద్యోగ యువత ఉపాధి లేక నిరుద్యోగ సమస్యతో ఖాళీగా ఉన్నారు. అధికారులు ఎప్పుడు ఉద్యోగాలు తీస్తారని ఎదురు చూపులు చూస్తున్నాము. తక్షణమే అధికారులు చర్యలు తీసుకొని ఐటిడి ద్వారా ఉపాధి కల్పించాలి.



కె.సూర్య ప్రకాష్
అల్లూరి యూత్ మండల అధ్యక్షుడు



చాపరాయి జలపాతం

# గిరిజన కార్మికురాలి ఉదారత

### -సొంత సొమ్ముతో గ్రామానికి రోడ్డు
### - సామాజిక ఆరోగ్య కార్యకర్తల ప్రశంసలు

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా ముంచంగిపుట్టు మండలం మారుమూల ప్రాంతమైన ఓ చిన్న కుగ్రామంలో సామాజిక ఆరోగ్య కార్యకర్తగా పని చేస్తున్న ఓ గిరిజన కార్మికురాలు తన గ్రామానికి సొంత సొమ్ము రూ.3 లక్షలతో రోడ్డు నిర్మించి తన ఉదారతను చాటుకున్నారు. జోలపుట్టు పంచాయతీ కేంద్రానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న గుడ్డుపుట్టు ఓ పాతిక కుటుంబాలు నివసిస్తున్న చిన్న కుగ్రామమిది. ఈ గ్రామానికి కోడలిగా వచ్చిన బురిడి జమ్మ తన స్వస్థలమైన డుంబ్రిగూడ మండలం చిన్న అంజోడ గ్రామం నుంచి కొన్నేళ్ల కిందట వచ్చి భర్తతో స్థిరపడింది. ఇంటర్ వరకు చదువుకున్న ఆమె ఈ గ్రామంలో సామాజిక ఆరోగ్య కార్యకర్తగా విధుల్లో చేరింది. గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేక గ్రామస్తులు అనేక అవస్థలు పడుతున్నారు ముఖ్యంగా ఆసుపత్రికి వెళ్లాలన్న, పిల్లల్ని జోలపుట్ పంచాయతీ కేంద్రంలోని పాఠశాలకు పంపించాలన్నా కష్టతరంగా ఉండేది. గర్భిణీలను రోగులను తానే స్వయంగా దగ్గరుండి డోలి మోతలతో ఆసుపత్రులకు తీసుకువెళ్లిన అనుభవాన్ని, గ్రామస్తులు ఎదుర్కొంటున్న ఆ కష్టాన్ని, దగ్గరుండి చూసిన ఆమె ఎంతో చలించి పోయింది. దీంతో చాలా మంది గ్రామస్తులు ఊరి విడిచి మరోచోట జీవనానికి వెళ్లే పరిస్థితులు కూడా ఆమె గమనించింది. రోడ్డు లేకపోవడంతో ఊరి ప్రజలు ఎదుర్కొంటున్న అవస్థల్ని ఆమె కళ్ళారా చూడడంతో గ్రామానికి ఎలాగైనా రోడ్డు నిర్మించాలని భావించింది. దీంతో ఆమె తన కుటుంబానికి ఇల్లు నిర్మించడం కోసం తాను దాచుకున్న రెండున్నర లక్షల రూపాయలు వెచ్చించి రోడ్డు నిర్మాణం ప్రారంభించింది. మరో ఇద్దరు దాతలు ఆమెకు 50 వేల రూపాయల సాయం అందించారు. దీంతో మూడు లక్షలతో సుమారు రెండున్నర కిలోమీటర్ల రోడ్డును నిర్మించింది. దీంతో ఆ గ్రామానికి ఆటోలు, బైకులు తిరిగే పరిస్థితి ఏర్పడింది. కొంత మేర రవాణా సమస్యకు పరిష్కారం ఏర్పడింది. ఆమెకు నెలకు కేవలం నాలుగు వేల రూపాయలు వేతనం మాత్రమే వస్తున్నా, పేదరికంలో కూడా గ్రామ ప్రజల కష్టాన్ని గుర్తించి ఊరి కోసం రోడ్డు నిర్మించి తన ఔదార్యాన్ని చాటుకుంది. ఈ సామాజిక ఆరోగ్య కార్యకర్తలు సహచర కార్యకర్తలందరూ ఎంతో అభినందిస్తున్నారు. సిఐటియు నాయకులు ఉమామహేశ్వరరావుతో పాటు సామాజిక ఆరోగ్య కార్యకర్తల సంఘం నాయకులు ఇటీవల ఆమెను సన్మానించి అభినందనలు తెలిపారు. రోడ్డు లేక తమ గ్రామస్తులు ఎదుర్కొంటున్న అవస్థల్ని అధికారులు గుర్తించాలని అసంపూర్తిగా ఉండిపోయిన మరో రెండు కిలోమీటర్ల రోడ్డును పూర్తి చేయాలని బురిడీ జమ్మ ఈ సందర్భంగా అధికారులను వేడుకుంటున్నారు.




జమ్మను సన్మానిస్తున్న సిఐటియు నేత ఉమామహేశ్వరరావు, సిహెచ్.బబ్బులు

# నాలుగో యూనిట్‌లో నిలిచిన విద్యుదుత్పత్తి

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు జల విద్యుత్ కేంద్రంలో నాలుగు యూనిట్లు మరమ్మతు పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఇఇ లక్ష్మీనారాయణ వెల్లడించారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నాలుగో యూనిట్ టెస్ట్ బేరింగ్ ప్యాడ్స్ రబ్బింగ్ అయ్యాయని, దీంతో యూనిట్ నుంచి విద్యుదుత్పత్తి నిలిచి పోయిందన్నారు. ఈ యూనిట్ మరమ్మతు పనులు అభిరామ కంపెనీకి అప్పగించామన్నారు. ఐదు రోజులుగా మరమత్తు పనులు నిర్వహిస్తున్నామని, మరో 20 రోజుల్లో మరమత్తులు పూర్తిచేసి యూనిట్లు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఒక్కో యూనిట్ మరమ్మతులకు సుమారు రూ.20 లక్షల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నామన్నారు. రెండు మూడు యూనిట్లు అందుబాటులో ఉన్నాయని, వీటి ద్వారా విద్యుదుత్పత్తి నిరాటంకంగా కొనసాగుతుందన్నారు. ఒకటో యూనిట్‌లో సాంకేతిక పరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ యూనిట్ నుంచి విద్యుదుత్పత్తి చేస్తున్నామన్నారు. గ్రిడ్ ఆదేశాలకు అనుగుణంగా విద్యుదుత్పత్తి సాగుతోందని ఇఇ లక్ష్మీనారాయణ వెల్లడించారు.



మరమ్మతుకు గురైన నాలుగో యూనిట్

# ఉద్యమనేత భీమయ్యకు జోహార్లు



జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపిపి లక్ష్మి, సిపిఎం నేతలు

ప్రజాశక్తి-విఆర్ పురం: కమ్యూనిస్టు పార్టీ తొలితరం ఉద్యమ నేత, తెలంగాణ పోరాటవీరుడు బొప్పెన భీమయ్య 20వ వర్ధంతిని ఆయన స్వగ్రామం విఆర్ పురం మండలంలోని అడవి వెంకన్నగూడెంలో అయన స్మారక స్థూపం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పూలమాలలు వేసి విప్లవ జోహార్లు, నివాళులు అర్పించారు. స్మారక స్థూపం వద్ద ఏర్పాటు చేసిన సిపిఎం జెండాను ఎంపిపి కారం లక్ష్మి ఆవిష్కరించాడు. స్మారక స్థూపం వద్ద బొప్పెన భీమయ్య చిత్రపటానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనేం సత్యనారాయణ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణ తొలితరం ఉద్యమనేత భీమయ్య ఆశయాలను, లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రజా సమస్యలు, గిరిజనుల హక్కుల కోసం భీమన్న పోరాటాన్ని మార్గదర్శకంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాసమస్యలపై అవగాహనతో వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని కార్యకర్తలు, నేతలను కోరారు. స్మారకస్థూపం వద్ద భీమన్నకు నివాళులర్పించిన వారిలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, మాజీ సర్పంచ్‌లు కుంజా నాగిరెడ్డి, ఆసు లక్ష్మయ్య, వడ్లాది రమేష్, కారం సుందరయ్య, సిపిఎం గ్రామశాఖ సభ్యులు, మహిళలు ఉన్నారు.

# మేడేను జయప్రదం చేయండి :సిఐటియు

ప్రజాశక్తి-విఆర్.పురం : మేడే కార్యక్రమాన్ని కార్మికులందరూ ఐక్యంగా విజయవంతం చేయాలని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ రంపచోడవరం జిల్లా సహాయ కార్యదర్శి పూనం సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని రేఖపల్లి గ్రామంలో సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, అంగన్వాడీలపై అధికార పార్టీ నేతలు, అధికారులు వేధింపులు రోజురోజుకూ ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలపై శాంతియుత పోరాటాలు చేస్తున్న వారిపై ప్రభుత్వం నిర్బంధకాండ, అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీల మధ్య విబేధాలు సృష్టించి ఉద్యమాన్ని నీరుగార్చేలా వ్యవహరిస్తున్న అధికారుల యత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మేడే వేడుకల్లో స్కీం వర్కర్లు భవన నిర్మాణ కార్మికులు, ఆటో, మోటారు యూనియన్, అవుట్‌సోర్సింగ్ కార్మికులు పాల్గొనాలని కోరారు.

# నేడు విద్యుత్ కళాభారతిలో నాటికల ప్రదర్శన

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో మేడే వేడుకలు పురస్కరించుకొని సోమవారం రాత్రి ఎపి జెన్‌కో విజయవాడ కళాకారులచే 'ప్రియమైన శత్రువు' అనే నాటికను .అలాగే సీలేరు కాంప్లెక్స్ ఇంజనీర్లు ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో 'ఐదో గది' నాటికను స్థానిక విద్యుత్ కళాభారతిలో ప్రదర్శించనున్నట్లు ఎపి జెన్‌కో ఇఇ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆయా నాటికలను విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి నాటికల పోటీల్లో ఎపి జెన్‌కో, ట్రాన్స్‌కో, ఇపిడిసిఎల్ ఉద్యగులు ప్రదర్శించారన్నారు. ప్రియమైన శత్రువు నాటికలో ఉత్తమ విలన్‌గా సుదీప్ ఉత్తమ హాస్యనటుడుగా బాబురావు ఎంపికయ్యారన్నారు. అలాగే ఎపి జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ కళాకారులు ప్రదర్శించిన 'ఐదో గది' రాష్ట్రస్థాయిలో ఉత్తమ నాటకంగా అవార్డులు అందుకుందన్నారు. ఇపుడు ఆయా నాటికలను మేడే సందర్భంగా సీలేరు విద్యుత్ కళాభారతితో ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమాన్ని ప్రజలంతా విజయవంతం చేయాలని కోరారు.

# గిరిజన మహిళ దారుణహత్య

ప్రజాశక్తి -సీలేరు: దారకొండ కాలనీకి చెందిన గడుతూరి వలసమ్మ ఆదివారం దారుణ హత్య గురైంది. ఈ సంఘటన ధారకొండలో తీవ్ర కలకలాన్ని రేపింది. జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ దారకొండ కాలనీకి చెందిన గడుతూరి వలసమ్మ (50), కాలనీకి సమీపంలో ఉన్న సుమారు కిలోమీటర దూరంలో పసుపు సాగు చేసుకోవటానికి తుప్పలు కొట్టేందుకు నాలుగు రోజులుగా వెళుతోంది. అదేవిధంగా ఆదివారం ఉదయం ఏడు గంటలకు పొలానికి వెళ్లిన వలసమ్మ, ఎప్పటిలాగే మధ్యాహ్నం భోజనానికి రాకపోవడంతో ఆమె కుమారుడు రాజు కోటి తల్లి పనిచేస్తున్న పొలం వద్దకు వెళ్ళాడు .సమీప అడవులలో తన కన్నతల్లి దారుణహత్యకు గురై రక్తపుమడుగులో ఉండడాన్ని చూసి కుమారుడు నిర్ఘాంత పోయి, బోరున విలపించాడు. అనంతరం సీలేరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. జికె.వీధి సిఐ అశోక్ కుమార్ స్థానిక ఎస్ఐ రామకృష్ణ, ఆధ్వర్యంలో పోలీసులు సంఘటన ప్రదేశాన్ని చేరుకుని వలసమ్మ హత్య గురైన తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జీకే వీధి సిఐ అశోక్ కుమార్ మాట్లాడుతూ వలసమ్మ హత్యపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. హత్యకు కారణాలుతెలియాల్సి ఉందన్నారు.





హత్యకు గురైన మహిళ వలసమ్మ,
సంఘటనాస్థలిని పరిశీలిస్తున్న పోలీసులు



మరమ్మతుకు నోచని వంతెన

# శిథిలావస్థలో వంతెన

### - కూలిన రక్షణ వలయం
### -పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్:మండంలోని చొంపి వంతెన ప్రమాదకరంగా మారింది. ఈ వంతెన మార్గం నుంచి చొంపి, శిరాగం, బస్కి, మాడగడ, హుకుంపేట మండలం బూర్జ, వేంగడ పంచాయతీ గ్రామాల గిరిజనులు తరుచుగా అరకులోయ మండల కేంద్రంలో పనులు నిమిత్తం రాకపోకలు చేస్తుంటారు. ఈ వంతెన సుమారు 40 ఏళ్ల క్రితం నిర్మించారు.ఈ వంతెన ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. వంతెనకు ఇరువైపులా ఉన్న ప్రహరీ రక్షణ వలయాలు కూడా విరిగి కూలి పోయాయి. దీంతో, అతి ప్రమాదకరంగా మారింది. ఈ వంతెనపై నుంచి టిప్పర్, లారీ వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుండటంతో ఏ సమయంలో ఏమి జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ఈ మధ్యకాలంలో కురుస్తున్న భారీ వర్షాలకు వంతెన మరింత ప్రమధకరంగా మారింది. గతంలో నిధులు మంజూరు చేసి మంజూరు చేసి నూతన వంతెన నిర్మించాలని పలు మార్లు అధికారులకు, స్థానిక ఎమ్మెల్యే చెట్టి పాల్గుణకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని స్థానిక గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే వంతెన నిర్మించాలని వాబోతున్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్త ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి-పెదబయలురూరల్:మండలంలోని జాడిగూడ గ్రామ అంగన్వాడి కేంద్రంలో పని చేస్తున్న అంగన్‌వాగీ కార్యకర్త అడకట్ల యశోదమ్మను ఉద్యోగ విరమణ పొందారు. వనభంగి సర్పంచ్ కొర్ర కాసులమ్మ, రాజు ఆధ్వర్యంలో అంగన్వాడి కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్త యశోధమ్మ, కామేశ్వరరావు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, యశోదమ్మ గత 35ఏళ్ల సర్వీస్‌లో అంకిత భావంతో పనిచేశారన్నారు. పసి పిల్లలను తన సొంత పిల్లలుగా చేసుకునే వారన్నారు. ప్రభుత్వం అందించిన పౌష్టిక ఆహారం సకాలంలో అందించి శిశుమరణాల నియంత్రణకు కృషి చేశారన్నారు.రవాణా సౌకర్యం లేనిరోజుల్లో మండల కేంద్రం నుండి సామగ్రిని సొంత ఖర్చులతో మోసుకొచ్చారన్నారు.



కార్యకర్త దంపతులను సన్మానిస్తున్న సర్పంచ్

# ఎక్కడికక్కడే అరెస్టులు, నిర్బంధాలు!

- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పర్యటనలో నిలదీతలు
- బోయ/వాల్మీకులను ఎన్‌టిల్లో చేర్చడంపై నిరసన
- గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావుతోపాటు పలువురి అరెస్ట్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : బోయ/వాల్మీకులు, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాల్లో చేర్చడాన్ని ఎందుకు ప్రశ్నించలేదని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను నిలదీసే ప్రయత్నం చేస్తున్న ఆదివాసీలు, గిరిజన సంఘం నేతలను ఎక్కడికక్కడే పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం మండలంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు పర్యటన నేపథ్యంలో గిరిజన సంఘం, ఆదివాసీ నేతలు కొండ్ల సూరిబాబు, తాము సూరిబాబు, వంత బాలకృష్ణ, పి సత్యనారాయణ, జర్తా రాజు, తదితరులను పోలీసులు అరెస్టులు చేసి రాజువొమ్మంగి, జడ్డంగి పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు.
రాజవొమ్మంగిలో పర్యటనకు వస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు ప్రయాణిస్తున్న కార్లను ఒట్టిగడ్డ గ్రామ శివారులో గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు అడ్డుకున్నారు. బోయ/వాల్మీకుల లను ఎస్టీ జాబిలో జాబితాలో చేర్చే విషయంలో ఎమ్మెల్యే వైఖరి తెలపాలంటూ పట్టుబట్టారు. దీన్ని గమనించిన పోలీసులు లోతా రామారావును బలవంతంగా ఈడ్చుకుంటూ, పోలీస్ జీప్ ఎక్కించి జడ్డంగి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తనను అక్రమంగా నిర్బందించడంపై లోతా రామారావు మండిపడ్డారు. ఆదివాసీలకు అన్యాయం జరుగుతుంటే ప్రశ్నించడం నేరమాఅన్నారు. అమాయక గిరిజనులపై కేసులు బనాయించడం అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని, దీన్ని గిరిజన సంఘం, ఆదివాసీ నేతలుగా తామంతా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అక్రమ అరెస్టులతో, బెదిరింపులతో ఉద్యమాలను ఆపలేరని, రానున్న కాలంలో వైసిపి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు, రామారావుతోపాటు పలువురు గిరిజన సంఘం నేతలు, ఆదివాసీలను కూడా పోలీసుల అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలిచారు.



గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావును ఈడ్చుకెళుతున్న పోలీసులు








పోలీసుల అదుపులో ఉన్న గిరిజన సంఘం, ఆదివాసీ నేతలు

## పోలీసుల అత్యుత్సాహం ఆపకుంటే ప్రజా ప్రతిఘటన

### - సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, మట్ల వాణిశ్రీ
### - గిరిజన సంఘం నేతల అరెస్ట్‌కు ఖండన

ప్రజాశక్తి- చింతూరు : బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ ఏజెన్సీ పర్యటనకు వస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను శాంతియుతంగా ప్రశ్నించడానికి వెళుతున్న గిరిజన సంఘం నేతలు , ఆదివాసీలను అరెస్ట్ చేయడం దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అన్నారు. గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోత రామారావు, కొంతమంది గిరిజన సంఘం నేతలను పోలీసులు బలవంతంగా ఈడ్చుకెళ్లి అరెస్ట్‌లు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు పట్ల అడ్డతీగల సీఐ దురుసు ప్రవర్తనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అరెస్ట్‌లు, నిర్బంధాల విషయంలో పోలీసుల అత్యుత్సాహాన్ని తగ్గించుకోవాలని, సీఐ ప్రవర్తన మార్చుకోకపోతే ప్రజా ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. అరెస్ట్ చేసిన గిరిజన సంఘం నాయకులను . తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు

**రంపచోడవరం:** రాజవొమ్మంగి మండలంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పర్యటన సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోత.రామారావు, గిరిజన సంఘం మండల నాయకుల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఎం అల్లూరి రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్ల.వాణిశ్రీ అన్నారు. రాజవొమ్మంగి మండలం వట్టిగడ్డలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అడ్డుకుంటారనే నెపంతో రామారావుతోపాటు ఇతర నేతలను నిర్బంధించడమే కాకుండా వారిపట్ల పోలీసుల అనుచిత వైఖరిని ఖండిస్తున్నామని మట్ల.వాణిశ్రీ, తీగల శ్రీనివాస్, సాధల విద్యాసాగర్‌రెడ్డి అన్నారు. పోలీసుల తీరు మారకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.


నీటిని సేకరిస్తున్న మహిళలు

## తాగునీటికి అవస్థలు

**ప్రజాశక్తి-హుకుంపేట:** సంతారి పంచాయతీ జలగలాబందలో నెలకొన్న తాగునీటి సమస్యను తీర్చాలని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నామన్నారు.సోలార్ హ్యాండ్ బోరింగ్ మరమ్మతులకు గురై మూలకు చేరింది. బావిలో నీరు అడుగంటి పోవడంతో గ్రామ ప్రజలు కాలిబాటన నడిచి పొలలో కలుషిత నీళ్లు సేకరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు.

## వాసవి మాత జయంతోత్సవాలు

**ప్రజాశక్తి- పాడేరు:**స్త్రీలోని ఆత్మీయతకు, అనురాగానికి, సౌమ్యానికి, త్యాగ గుణానికి, పవిత్రతకు నిలువెత్తు నిదర్శనమైన వాసవి కన్యకా పరమేశ్వరి జయంతోత్సవాన్ని ఆదివారం పాడేరులో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమా నీలకంటేశ్వర స్వామి వారి ఆలయంలో వాసవి మాతకు శాసన సభ్యురాలు భాగ్యలక్ష్మి, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ నర్సింగ్‌రావు పూజలు నిర్వహించారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు వుడా త్రినాధరావు సారధ్యంలో జిల్లా గవర్నర్ వరహాలరావు, ఫాస్ట్ గవర్నర్ శ్రీనాథ శ్రీను, వైస్ గవర్నర్ నరసింహారావు, జిల్లా సెక్రెటరీ మధు, కోశాధికారి కె.వి స్వామిలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి దంపతులు సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి దంపతులను వాసవి క్లబ్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు, పట్టణ వాసవి క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## 2న ఉచిత వైద్య శిబిరం

**ప్రజాశక్తి-పాడేరు టౌన్:** జిల్లా కలెక్టర్ సమిత్ కుమార్ ఆధ్వర్యంలో విశాఖకు చెందిన ఎబిలిటీ పీపుల్ సహకారంతో ఈనెల 2న మంగళవారం జిల్లా కలెక్టరేట్ వద్ద జిల్లాస్థాయి ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సమగ్ర శిక్ష ఎక్స్అఫీషియో డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, డిఇఒ డాక్టర్ ఎస్ కె సలీం భాషా, ఐఇ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ కె.భాస్కరరావు ప్రకటనలో తెలిపారు. మే 2న మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విశాఖకు చెందిన ఎబిలిటీ పీపుల్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక వైద్యశిబిరాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాధితులకు ఉచిత శస్త్రచికిత్సలు, మందులను ఇవ్వనున్నట్లు తెలిపారు.

## భూ హక్కు పత్రాలు సిద్ధం

**ప్రజాశక్తి-కోటవురట్ల:**రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రక్ష సర్వే కింద రైతులకు అందజేయనున్న భూ హక్కు పత్రాలు తహసిల్దార్ కార్యాలయానికి చేరుకున్నాయి. ఈ మేరకు సర్వే పూర్తయిన గ్రామాలకు సంబంధించి సిబ్బంది పత్రాలను సిబ్బంది సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా మొదటి విడత సర్వే పూర్తయిన అన్నవరం, ఎండపల్లి, సుంకపూరు, జల్లూరు, రాజుపేట, రామన్నపాలెం గ్రామాలకు సుమారు 1881 పట్టాదారు పాస్ పుస్తకాలు వచ్చినట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి. రాజుపేట గ్రామానికి భూ హక్కుపత్రాలు రావాల్సి ఉండగా ఐదు గ్రామాలకు 2916 ఖాతాలకు గాను 1881 పుస్తకాలు పంపిణీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. సుంకపూరుకు 593, రామన్నపాలెం 308, జల్లూరు 490, ఎండపల్లికు 478, వచ్చాయి. అన్నవరంకు 694 పాస్ పుస్తకాలకుగాను కేవలం 12 పుస్తకాలు మాత్రమే వచ్చినట్లు తెలిపారు.

# రోడ్డు పక్కన కుళ్లిన కోళ్లు


రోడ్డు పక్కనే పారబోసి ఉన్న చనిపోయిన కోళ్లు

### దుర్వాసనతో గిరిజనుల ఇబ్బంది

**ప్రజాశక్తి దుంబ్రిగుడ:-** మండలంలోని పాడేరు ప్రధాన రోడ్డు బల్లుగూడ, పనస పూట్టు మోడల్ కాలనీ మధ్యలో నున్న రోడ్డు పక్కన చనిపోయిన వందల సంఖ్యలో బాయిలర్ కోళ్లను శనివారం రాత్రి పడేశారు. మృతి చెందిన కోళ్లు కావడంతో ఆ రోడ్డున వెళ్ళే మార్గంలో పూర్తిగా దుర్వాసన వస్తుంది. దీంతో ఈ రోడ్డు మార్గానికి వెళ్లే గిరిజనులు వాహనదారులు ఆదివారం ఇబ్బందులు పడ్డారు. మోడల్ కాలనీ గ్రామానికి కూడా దుర్వాసన వెళ్తుండటంతో ఆ గ్రామస్తులు పలు ఇబ్బందులు పడ్డారు. తక్షణమే అధికారులు స్పందించి రోడ్డు పక్కన పడేసిన బాయిలర్ కోళ్లను వెంటనే తొలగించాలని గిరిజనులు కోరుతున్నారు.

# జెడ్‌పి నిధులతో కల్వర్టు మంజూరు

**ప్రజాశక్తి-హుకుంపేట:**సాలేపుగొంది గ్రామంలో జడ్పీ నిధులతో కల్వర్టు మంజూరు చేయనునట్లు జడ్పీటీసీ రేగం మత్స్యలింగం తెలిపారు. మండలంలోని కొట్నాపల్లి పంచాయతీ లోపోలం, ఎగువమాలపాడు తదితర గ్రామాలను ఆదివారం సందర్శించారు. పలు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రం లేక ఇంటి వద్ద పిల్లలు ఉంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు. పాఠశాల, అంగన్వాడీ కేంద్రం మంజూరు చేయాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేసేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కొట్నాపల్లి సర్పంచ్ కాకరి బొంజాబాబు, వైఎస్ఆర్‌సీపీ నాయకులు కొర్ర గురుమూర్తి, గెమ్మెలి రామారావు పాల్గొన్నారు.


కల్వర్టును పరిశీలిస్తున్న జెడ్‌పిటిసి

# వాలీబాల్ కిట్లు పంపిణీ


వాలీబాల్ కిట్లు అందిస్తున్న పోలీసులు

**ప్రజాశక్తి -దుంబ్రిగూడ:** మండలంలోని ఆంధ్ర ఒడిస్సా సరిహద్దు తూటంగి గుంటసీమ పంచాయితీ జర్రాయి, బల్లకట్టు, తోక వలస, దూబరాయి, లాసేరు, దాతూరు, తదితర గ్రామాల్లో స్థానిక ఎస్సై సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో స్పెషల్ పార్టీ పోలీసులు ఆదివారం సందర్శించారు. గిరి యువతకు వాలీబాల్ కిట్లను, చిన్నారులకు బిస్కెట్లను పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మెడికల్ కిట్లను కూడా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, గిరి యువత గంజాయి, అసాంఘిక కార్యకలాపాల జోలికి పోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ పార్టీ పోలీసులు, గిరిజనులు పాల్గొన్నారు.

# విచారణకు రావాలని నోటీస్

**ప్రజాశక్తి గొలుగొండ:** మండలంలో పాకలపాడు పంచాయతీలో గతంలో జరిగిన అవకతవకలపై లోకాయుక్తకు గ్రామానికి చెందిన మాకిరెడ్డి వెంకటరమణ చేసిన ఫిర్యాదు పై తిరిగి లోకాయుక్త కు హాజరు కావాలని శనివారం నోటీసులు ఇచ్చారు. గతంలో పాకలపాడు గ్రామంలో విఆర్వో సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి ఆర్‌వి సత్యనారాయణలు అవినీతికి పాల్పడ్డారంటూ గ్రామానికి చెందిన వెంకటరమణ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పట్లో అధికారులు విచారణ చేసి అవినీతికి పాల్పడిన పంచాయతీ కార్యదర్శి నుండి ఇంటి పన్నులు రూపంలో వసూలు చేసిన 3 లక్షల 4 వేల811 రూపాయలను డిఎల్‌పిఒ ఆధ్వర్యంలో పంచాయతీ ఖాతాకు జమ చేయించారు. దానిపై సంతృప్తి చెందని లోకాయుక్త విచారణ కొనసాగించాలననే నేపథ్యంలో జూన్ 14న లోకాయుక్తకు హాజరు కావాలని వెంకటరమణకు నోటీసు అందజేశారు. ఈ నేపథ్యంలో అవినీతికి పాల్పడిన పంచాయితీ కార్యదర్శికి నోటీసులు అందజేస్తామని ఆయనకు తెలిపినట్లుగా వెంకటరమణ తెలిపారు.

## నేరాలు ఘోరాలు

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**ప్రజాశక్తి - ఆరిలోవ :** రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బిఆర్‌టిఎస్ రోడ్డు పందులఫాం సమీపంలో చోటు చేసుకుంది. ఆరిలోవ పోలీసుల కథనం ప్రకారం... సీతమ్మధార, టిపిపి కాలనీలో నివాసం ఉంటున్న బండారు శ్రీరామమూర్తి(60) విఎంఆర్‌డిఎలో డ్రాఫ్ట్‌మేన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం తన స్వగ్రామానికి వెళ్లి బిఆర్‌టిఎస్ రోడ్డు అడివివరం వైపు నుంచి హనుమంతువాక వైపు బైక్‌పై వస్తుండగా పెదగదిలి దాటిన తరువాత ముందు ఉన్న ద్విచక్రవాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తున్న క్రమంలో ఆ వాహనాన్ని ఢీకొట్టారు. బైకు అదుపు తప్పి కింది పడిపోయారు. శరీరంపై దెబ్బలు కనబడక పోయినా అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు శ్రీరామమూర్తికి భార్య పద్మ, ఇద్దరు కుమారులు చక్రధర్, శ్రావణ్ ఉన్నారు. ఆరిలోవ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని కెజిహెచ్ మార్చురికీ తరలించారు.

### బైక్ బోల్తా పడి యువకుడు మృతి

**ప్రజాశక్తి -తగరపువలస :** భీమిలి మండలం దాకమర్రి 16వ నంబర్ జాతీయ రహదారి వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు మృతిచెందాడు. భీమిలి ఎస్ఐ జి.హరీష్ కథనం ప్రకారం... విజయనగరం జిల్లా డెంకాడ మండలం మోదవలసకు చెందిన నమ్మి రాంబాబు (23), లొడగల వెంకటేష్ కలిసి మోటారు బైక్ పై విజయనగరం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో సొంతూరు వస్తుండగా మార్గమధ్యంలో దాకమర్రి వద్ద బైక్ అదుపుతప్పి బోల్తా పడింది.ఈ ప్రమాదంలో వాహనాన్ని డ్రైవ్ చేస్తున్న రాంబాబు తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అంబులెన్స్‌లో సంగివలసలోని అనిల్ నీరు కొండ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ఆరిలోవలోని అపోలో ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అదే రోజు రాత్రి 9.20 గంటలకు మృతి చెందాడు. మృతుని తండ్రి నమ్మి నారయణప్పడు ఫిర్యాదు మేరకు ఎస్ఐ హరీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### 18 కిలోల గంజాయి పట్టివేత

**ప్రజాశక్తి- గొలుగొండ:** మండలంలో ఎఎల్ పురం బస్టాండ్ వద్ద 18 కిలోల గంజాయి, నలుగురు నిందితులను పట్టుకున్నామని కృష్ణదేవిపేట ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం... ఆదివారం ఉదయం ఏఎల్ పురం బస్టాండ్ లో బస్ కోసం వేచి చూస్తున్న తమిళనాడుకు చెందిన నలుగురును పోలీసులు తనిఖీలు చేశారు. వారి దగ్గర ఉన్న బ్యాగుల్లో 18 కేజీల గంజాయి దొరికింది. తమిళనాడు రాష్ట్రానికి చెందిన శంకర్, శక్తివీర్, శివశక్తి, నూర్ మహమ్మద్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుండి రూ.1500 నగదు, రెండు సెల్ ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్టుగా ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు.

### డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య కేసులో నిందితుడు అరెస్టు

**ప్రజాశక్తి-అనకాపల్లి** : డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్టు రూరల్ సిఐ ఏ రవికుమార్ ఆదివారం విలేకరులకు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలివి. అనకాపల్లి మండలం దిబ్బపాలెం గ్రామానికి చెందిన పెంటకోట మధుకుమార్ అనకాపల్లి సాయి కుల్వంత్ కళాశాలలో డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన పెంటకోట కన్నంనాయుడు వద్ద దఫదఫాలుగా అధిక వడ్డీకి రూ.92 వేలు అప్పు తీసుకున్నాడు. ఇందుకుగాను రూ. 33 వేలు వడ్డీగా కూడా చెల్లించాడు. అయితే అసలు వడ్డీ చెల్లించమని మధు కుమార్‌పై ఒత్తిడితోపాటు బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో మధుకుమార్ ఈనెల 23న ఆత్మహత్య ప్రయత్నం చేశాడు. తక్షణమే అతనిని ఆసుపత్రికి తరలించగా ఈనెల 25న మృతి చెందాడు. దీనిపై రూరల్ సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితుడు కన్నం నాయుడును అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్టు సీఐ రవికుమార్ తెలిపారు.

### రిజర్వాయర్లలో అడుగంటిన నీటి నిల్వలు

**ప్రజాశక్తి-గొలుగొండ:** మండలంలో రావణాపల్లి రిజర్వాయర్లో శనివారంతో చేపల వేట ముగిసింది. ప్రతి ఏడాది మండలంలోని స్వదేశీ మత్స్యకార సొసైటీకి చెందిన 208 మంది సభ్యులు తమ భాగస్వామ్యంతో జూలై నెలలో రిజర్వాయర్లో చేప పిల్లలు వేసుకొని ఫిబ్రవరి నెల వరకు పెంచుకొని వాటిని వేట సాగించి ఆదాయం సంపాదించుకుంటారు. ఈ క్రమంలోని ఈ ఏడాది కూడా మార్చి, ఏప్రిల్ నెలలో మత్స్యకార సొసైటీ చైర్మన్ నక్క రమణ ఆధ్వర్యంలో చేపల వేట సాగించి మత్స్యకారులు ముగించారు. రిజర్వాయర్ లోని నీటి నిల్వలు అడుగంటడంతో చేప పిల్లలను పూర్తిస్థాయిలో తీసుకున్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న వైసిపి కార్యకర్తలు

## కుమ్మర్లలో 'జగనన్నే మా భవిష్యత్'

**ప్రజాశక్తి - కొయ్యూరు:** మండలం డౌనూరు సచివాలయం మూలపేట పంచాయతీ కుమ్మర్ల గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ రావుల వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో వైసిపి నేతలు గడపగడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. జగన్ పాలనపై ప్రజాభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. గృహసారథులు, సచివాయ కన్వీనర్లు నూకరాజు, సత్తిబాబు, శారద, వాలంటీర్లు పాల్గొన్నారు.

## అప్పన్న సన్నిధిలో ఎంపి మాధవి దంపతులు

**ప్రజాశక్తి -కొయ్యూరు :** సింహాద్రి అప్పన్నను అరకు ఎంపీ గొట్టేటి మాధవి, అమె భర్త 'నేను సైతం' ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.శివప్రసాద్ దంపతులు దర్శించుకున్నారు. ఎంపీ దంపతులకు ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం అర్చకుల ఆశీర్వదించగా,దేవస్థానం అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు మహేష్‌బాబు పాల్గొన్నారు.

## వైసిపి హయాంలో ఆదివాసీలకు అన్యాయం

**ప్రజాశక్తి -రంపచోడవరం** :షెడ్యూల్డ్ ప్రాంతమైన తూర్పు ఏజెన్సీ రంపచోడవరం డివిజన్‌లోని పదవులు పందేరంలో నిజమైన ఆదివాసీ గిరిజనులకు వైసిపి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందనిఆదివాసీ జెఎసి రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు కంగల శ్రీనివాసు, రాష్ట్ర ఆదివాసి జెఎసి సలహాదారు కత్తుల ఆదిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కె.సన్యాసి రెడ్డి, జాతీయ సలహాదారు పోడియం పండుదొర, తెల్లం శేఖర్, చవలం శుభకృష్ణ, మడకం ప్రసాద్, పోడియం శ్రీనుబాబు, కారం రామన్న దొర, మట్ల కృష్ణారెడ్డి తదితరులు ఆవేదన వ్యక్తంచేశారు.ఐదోషెడ్యూల్ ప్రాంతంలో నామినేటెడ్, ఇతర ప్రజాప్రాతినిధ్య పదవులన్నీ గిరిజనులకు కేటాయించాల్సి ఉండగా, వైసిపి ప్రభుత్వం నిబంధనలను కాలరాసి, గిరిజనేతరులకు కట్టబెడుతోందని మండిపడ్డారు. రంపచోడవరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం చైర్మన్‌గా జల్లేపల్లి రామన్న దొర అనే గిరిజనేతరుడిని నియమించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దేవాలయ చైర్మన్ పదవిని కూడా గిరిజనేతరుడికే ఇచ్చారని మండిపడ్డారు. తక్షణమే ఆయా నియామకాలను రద్దుచేసి, ఆ పదవుల్లో గిరిజనులను నియమించాలని కోరారు. ఏజెన్సీ నిబంధనలకు విరుద్ధంగా నియమాకాలు జరుగుతున్నా స్థానిక వైసిపి నేతలు నోరు తెరకవపోవడ దారుణమన్నారు. తక్షణమే ఆయా నియామకాలను రద్దు చేసి, గిరిజనులకు న్యాయం చేయకుంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు.

## ఉగ్రం చిత్ర యూనిట్ సందడి

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** ఉగ్రం చిత్ర యూనిట్ నగరంలో సందడి చేసింది. నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చిత్ర హీరో అల్లరి నరేష్ మాట్లాడుతూ ఉగ్రం చిత్రం తన సినీ కెరియర్‌లో ఓ హైలెట్ చిత్రంగా నిలిచిపోతుందని అన్నారు. ఈ చిత్రం సూపర్ హిట్ అవుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది తనకు 60వ చిత్రమని చెప్పారు. మిస్సింగ్ కేసుల గురించి ఈ సినిమాలో చూపించామన్నారు. లాక్‌డౌన్ సమయంలో 1.5 లక్షల మంది కనిపించకుండా పోయారనే విషయం తెలిసిందేనని, వారంతా ఏమయ్యారో ఇప్పటికీ తెలియదని చెబుతూ రూపొందించిందే ఉగ్రం చిత్రమని చెప్పారు. ఈ నెల 5న చిత్రం విడుదలవుతుందని తెలిపారు. చిత్ర హీరోయిన్ మీర్నా మీనన్ తెలుగులో ఇది తనకి రెండో చిత్రమని అన్నారు. ఈ చిత్రానికి శ్రీ చరణ్ పాకాల సంగీతం అందించగా, కెమెరామెన్‌గా సిద్ అద్భుతంగా తెరకెక్కించారని చెప్పారు.

# బిజెపితో దేశానికి నష్టం

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు
### అనకాపల్లిలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన ప్రచార భేరి సభ

**ప్రజాశక్తి - అనకాపల్లి**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలతో దేశ ప్రగతికి తీవ్ర విఘాతం ఏర్పడుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అన్నారు. బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన 15 రోజులుగా జిల్లాలో నిర్వహిస్తున్న ప్రచార భేరి కార్యక్రమం ముగింపు సభ స్థానిక దొడ్డి రాము నాయుడు కార్మిక, కర్షక నిలయంలో జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వై.వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడారు. మోడీ ప్రభుత్వ విధానాల వల్ల అన్ని ధరలూ పెరిగాయన్నారు. 32 మంది ఆత్మబలిదానాలతో ఏర్పడిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తే రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. రిజర్వేషన్లు అమలు కాకపోవడంతో పాటు లక్షలాది మంది కార్మికులు, ఉద్యోగులు రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగంపై మోడీ ప్రభుత్వం దాడి చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను బిజెపి ప్రభుత్వం కారు చౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతోందని, కార్మిక చట్టాలను రద్దు చేసి హక్కులను కాలరాస్తోందని తెలిపారు. బడ్జెట్‌లో ఉపాధి హామీ పనులకు రూ.50 వేల కోట్లు కోత విధించడం ద్వారా ఆ చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీ తొమ్మిది సంవత్సరాలైనా నెరవేరలేదన్నారు. పెద్ద నోట్ల రద్దుతో ఆర్థిక వ్యవస్థ కుదేలైందన్నారు. బిజెపి వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఆ పార్టీ నేతలు మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని తెలిపారు. మోడీని గద్దె దించితేనే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన బిజెపి విధానాలకు మద్దతు తెలుపుతున్నాయన్నారు. ఎపికి తీవ్ర ద్రోహం చేసిన మోడీ సర్కారును ఆ పార్టీలు ప్రశ్నించకపోవడం దారుణమన్నారు. బిజెపి మతోన్మాద విధానాలపై పోరాటం చేసే వారితో వామపక్షాలు కలిసి ఉద్యమిస్తాయన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, మాకిరెడ్డి రామునాయుడు, వైఎస్.భద్రం, తాకాశి వెంకటేశ్వరరావు, వి.రాజు, సిపిఎం మండల కార్యదర్శి గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, వివి.శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు కొణతాల హరినాథ్ బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వై.వెంకటేశ్వరరావు

# పరిశ్రమల అభివృద్ధికి స్టార్టప్ ప్రీమియర్ లీగ్


వేదికపై అతిథులు, కార్యక్రమ నిర్వాహకులు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల వేదికగా వంద అంకుర సంస్థల స్థాపనకు అడుగులు పడ్డాయి. సర్వజ్ఞ ఫౌండేషన్, నెంబర్ వన్ ఒటిటి, స్టార్ట్ అప్ ప్రీమియర్ లీగ్, దర్బార్ ఎంటర్ టైన్‌మెంట్స్ సంస్థలు సంయుక్తంగా స్టార్టప్ ప్రీమియర్ లీగ్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించాయి. ముఖ్య అతిథిగా హాజరయిన సిబిఐ మాజీ జెడి వివి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించి, తద్వారా అంకుర పరిశ్రమలు నిర్మాణానికి సర్వజ్ఞ ఫౌండేషన్ అన్ని విధాలా కృషి చేస్తోందని అన్నారు.

కార్యక్రమంలో విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యా సంస్థ చైర్మన్ జి.సత్యనారాయణ, నెంబర్ వన్ ఒటిటి మీడియా సంస్థ సిఎమ్‌డి మంచాల సాయి సుధాకర్ నాయుడు, స్టార్టప్ ప్రీమియర్ లీగ్, సర్వజ్ఞ సంస్థల వ్యవస్థాపకులు, సిఇఒ డాక్టర్ అనిల్ కుమార్ పసినిబిల్లి (డోలోనాథ్), మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, పలువురు విద్యావేత్తలు పాల్గొన్నారు.


షాట్ కొడుతున్న క్రీడాకారుడు

## ఉత్సాహభరితంగా క్రికెట్ పోటీలు

**ప్రజాశక్తి - సీలేరు:** యంగ్ ప్లేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన జీకే.వీధి మండలం సీలేరులో క్రికెట్ పోటీలు రెండో రోజు ఆదివారం ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. ఆదివారం పప్పులూరు, సీలేరు ఏ జట్లు మధ్య జరిగిన తొలిపోటీలో సీలేరు జట్టు విజయం సాధించింది. సీలేరుజట్టు పది ఓవర్లలో 119 పరుగులు చేయగా, తర్వాత పప్పులూరు జట్టు 35పరుగులకే అలౌట్ అయ్యింది. మరోమ్యాచ్‌లో దుర్గావీధి, పొల్లూరు జట్లు మధ్య జరిగిన పోటీలో పొల్లూరు జట్టు ఘన విజయం సాధించింది. పొల్లూరు జట్లు పది ఓవర్లలో 82పరుగులు చేయగా, లక్ష్యసాధనలో తర్వాత బ్యాటింగ్ చేపట్టిన దుర్గావీధి జట్లు విఫలమై, కేవంల 45పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. అలాగే సీలేరు బీ. పాలగడ్డ మధ్య పోటీలో సీలేరు బీ జట్టు ఘనవిజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేపట్టిన పాలగడ్డ జట్లు పది ఓవర్లలో 50 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్ చేపట్టిన సీలేరు బీ జట్లు కేవలం నాలుగు ఓవర్లలోనే 52 పరుగులు చేసి అలవోకగా విజయం సాధించింది.. క్రికెట్ పోటీలను తిలకించేందుకు భారీగా వచ్చిన ప్రేక్షకులు, క్రీడాకారులను ఉత్తేజపరుస్తూ కేరింతలు కొట్టారు. ఈ సందర్భంగా యంగ్ ప్లేయర్స్ అసోసియేషన్ నాయకులు శ్యామ్‌సన్ ( బుజ్జి) మాట్లాడుతూ మారెమ్మ సమ్మర్ క్రికెట్ పోటీల్లో ఆంధ్రా, ఒడిశా ప్రాంతాలకు చెందిన 20జట్లు పాల్గొంటున్నాయని, లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో జరుగుతున్న పోటీలు ఉత్సాహభరితంగా సాగుతున్నాయన్నారు. ఆదివారం జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి క్రీడాకారుడుల యువరాజ్‌ను ఎస్‌సి,ఎస్‌టి అసోసియేషన్ అధ్యక్షుడునాగరాజు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డులు అందజేసి, అభినందిచారు.

## ఘనంగా ఫరూఖీ పుట్టిన రోజు వేడుకలు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** వైసిపి మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐహెచ్.ఫరూఖీ పుట్టిన రోజు వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. అక్కయ్యపాలెంలోని ఫరూఖీ కార్యాలయంలో గురుస్థానం ది ప్లే స్కూల్స్ డైరెక్టర్ ఎస్.ఖాన్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఖాన్ మాట్లాడుతూ ఫరూఖీ మైనారిటీల అభివృద్ధి ఎంతో కృషి చేశారన్నారు. యువతను అన్ని విధాలుగా ప్రోత్సహించారని తెలిపారు.


ఫరూఖీకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఖాన్

## తీరంలో వ్యర్థాల తొలగింపు

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** స్వచ్ఛ కేర్ నినాదంతో కేర్ హాస్పిటల్స్ వారు సామాజిక బాధ్యతగా ఆదివారం ఆర్‌కె బీచ్ పరిసరాలను శుభ్రం చేశారు. ముందుగా కాళీ మాత గుడి నుంచి ర్యాలీ చేపట్టారు. మన నగరం - మన బాధ్యత అంటూ పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. ర్యాలీ అనంతరం బీచ్ వెంబడి రెండు కిలోమీటర్ల మేర ఉన్న వ్యర్థాలను తొలగించారు. 50 మందికిపైగా కేర్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్న ఈ ప్రత్యేక కార్యక్రమానికి కేర్ హాస్పిటల్స్ పరిపాలనాధికారి వద్దిపర్తి శ్రీనివాస్ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణలో పరిసరాల పరిశుభ్రత చాలా ముఖ్యమని అన్నారు.